# అడుగంటుతున్న చెరువులు

- మూగజీవాలకు తాగునీటి సమస్య
- నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని పశుపోషకుల విజ్ఞప్తి


నున్నలో ఎండిపోయిన బూరుగుల చెరువు


పి.నైనవరం చెరువులో మోటార్లు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాల్లో చెరువులు అడుగంటుతున్నాయి. భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టి రోజు రోజుకి పంట పొలాలకు నీటి అవసరం అధికమవుతోంది. మండలంలో దాళ్వా సీజన్‌లో 5,400 ఎకరాల్లో రైతులు వరి, జొన్న, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేశారు. ముందుగా వరి నాట్లు వేసిన రైతాంగం పంట కోతలు పూర్తి చేసుకున్నారు. అయితే చెరువు ఆయకట్టు పరిధిలో ఉన్న రైతులు, ఆలస్యంగా నాట్లు వేసిన వారు ఆఖరి తడుపు కోసం చెరువుల్లో నీటిని మోటార్ల ద్వారా పొలాలకు పెడుతున్నారు. దీంతో గ్రామాల్లోని చెరువులు అడుగంటుతున్నాయి. బోర్లు ఎండిపోయి నీరు అందని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రోజువారి అవసరాల కోసం ఇబ్బందులు పడుతున్నారు. నున్న గ్రామంలో నాలుగు బోర్లు ఎండిపోవడంతో ట్యాంకర్ల ద్వారా గ్రామ పంచాయతీ నీటి సరఫరా చేస్తోంది.

**ఇలా అయితే పశుపోషణ ఎలా.!**

ఎండలు తీవ్రంగా ఉండటంతో గాలిలో తేమలేకపోవడంతో వడగాల్పుల వల్ల బయటకు రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. దాహం వేస్తే అడగలేని మూగజీవాలకు చాలా దయనీయమైన పరిస్థితితులు ఏర్పడ్డాయి. గేదెలు, దూడలు, ఆవులు, ఎడ్లు, గొర్రెలు, మేకలకు తాగునీరు దొరికే పరిస్థితి కనిపించడం లేదు. పొలాల్లో మేత మేసే గొర్రెలు, మేకలను తాగునీటి కోసం చెరువులకు తోలతారు. అయితే చెరువుల్లోనే నీరు లేకపోవడంతో వాటిని పోషించడం కష్టమతోందని పోషకులు ఆందోళన చెందుతున్నారు. నున్న గ్రామంలోని బూరుగుల చెరువు, జంగమవాని చెరువు, పుల్లయ్య చెరువుల్లో నీరు అడుగంటిపోయి కనిపిస్తున్నాయి. అటవీ ప్రాంతాల్లో ఉన్న జీవాలకుంట, చెరుకులవాని కుంటలు పూర్తిగా ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. పాతపాడు, కుందావారి కండ్రిక గ్రామాల్లో చేపలను పెంచుకునే వారు నీటిని బయటకు పంపి చేపలను పట్టేందుకు ప్రయత్నాలు చేస్తుండటంతో వచ్చే నెలలో ఆ చెరువుల్లో కూడా నీరు ఉండదని పశుపోషకులు అంటున్నారు. చెరువులను పూర్తిగా ఎండగట్టి చెరువుల్లో మట్టిని అమ్ముకోవాలని చూసేవారు లేకపోలేదు.

**ఆందోళనలో పశుపోషకులు**

వాతావరణ శాఖ ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని హెచ్చరికలు చేస్తుండటంతో పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. పశుసంవర్ధక శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో పాడిగేదెలు 15,806, ఆవులు, ఎద్దులు 2,936, గొర్రెలు 4,732, మేకలు 2,289 ఉన్నాయి. వేసవి కాలంలో పశువులకు నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయాలని పశుపోషకులు కోరుతున్నారు. ప్రభుత్వం గ్రామాల్లో నీటి తొట్టెలను నిర్మించి నీటిని నింపి, వాటిపై పర్యవేక్షణ ఉంచాలని పశుపోషకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### చెరువుల్లో నీరు లేదు



మా గ్రామంలోని రెండు చెరువుల్లో నీరు తగ్గుముఖం పట్టాయి. వచ్చే నెల రోజుల్లో పూర్తిగా ఎండిపోయి పశువులకు నీరు దొరికే వీలుండదు. ప్రభుత్వం నీటి తొట్టెలు నిర్మించి మేకలు, గొర్రెలకు తాగునీటి సదుపాయం కల్పించాలి.

– దావు సాంబశివరావు, పి.నైనవరం

### ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



గొర్రెలు, మేకలతో పాటు పాడిపశువులకు కూడా నీరు అవసరమే. ఎండలు తీవ్రంగా ఉన్నాయి. పశువులు తాగేందుకు నీటి సదుపాయం కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాసరావు, పి.నైనవరం గ్రామం

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం


పెనమలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


కంకిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు

పెనమలూరు: పౌష్టికాహారంతోనే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ కార్యాలయం సూపరిండెంట్ వీ కృష్ణభవాని అన్నారు. పోషణ్ పక్వాడా పక్షోత్సవాల సందర్భంగా పెనమలూరు గ్రామంలో పెనమలూరు, గోసాల సెక్టార్లకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణభవాని మాట్లాడుతూ తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీలలో బిడ్డ పెరుగుదల, అలాగే రెండు సంవత్సరాల లోపు చిన్నారుల పెరుగుదల పౌషికాహారంపైనే ఆధారపడి ఉంటుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లభిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా తీసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం పక్షోత్సవాలు ఈ నెల 22వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ భరద్వాజ్, పీ నాగేశ్వరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కే శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణే లక్ష్యం**

కంకిపాడు: తల్లీ బిడ్డ ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా పనిచేయాలని ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు సీడీపీఓ కేబీ సుకన్య సూచించారు. పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సుకన్య మాట్లాడుతూ పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని న్యూఢిల్లీ నుంచి మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ మంత్రి ప్రారంభించారని తెలిపారు. వెయ్యి రోజుల సంరక్షణ ద్వారా తల్లీబిడ్డను ఆరోగ్యంగా ఉంచడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. లబ్ధిదారులు తమ వివరాలను పోషణ్‌ట్రాకర్ యాప్‌లో నమోదు చేసుకునే విధానంపై అవగాహన పెంపొందించాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అన్నామణి, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు బరంతులు పోస్తున్నారు

సాక్షి ఎఫెక్ట్


గోసాల పరిధిలోని సిమెంటు రోడ్డు మార్జిన్‌లో పోసిన బరంతు

కంకిపాడు: సిమెంటు రోడ్లు నిర్మించిన ప్రాంతాల్లో రోడ్డు మార్జిన్‌లలో బరంతు పోసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. 'బరంతులు వదిలేశారు' శీర్షికన ఇటీవల సాక్షిలో కథనం ప్రచురితమైంది. సిమెంటు రోడ్లు నిర్మించినా బరంతులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీనిపై స్పందించిన పంచాయతీ రాజ్ అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లతో రోడ్డు బరంతులు ఏర్పాటు చేయిస్తున్నారు. గోసాల గ్రామ పరిధిలో రూ. 33 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గతంలో పరిశీలించారు. ఈ రోడ్డు మార్జిన్‌లను రబ్బిష్‌తో బరంతులు పోశారు. అదేవిధంగా రోడ్డుకు మరో వైపు నిర్మించిన డ్రెయినేజీ ఎత్తు తక్కువగా ఉండటంతో నిర్మాణ పనులు ప్రహసనంగా మారాయంటూ కథనంలో పేర్కొనడం జరిగింది. దీంతో ఆ డ్రెయిన్ ఎత్తు కూడా పెంచారు.

## కార్పొరేషన్ల రుణాలకు ఇంటర్వ్యూలు


ఉంగుటూరులో అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీఓ జోగేశ్వరరావు

నున్న(విజయవాడరూరల్): వివిధ కార్పొరేషన్ల రుణాల కోసం మండల విద్యాశాఖాధికారి ఆదూరి వెంకటరత్నం ఆధ్వర్యంలో మంగళవారం నున్న గ్రామ సచివాలయం–2లో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్‌బీఐ, సప్తగిరి బ్యాంక్, యూకో బ్యాంక్, కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి బ్యాంక్ అధికారులు, సచివాలయ సిబ్బంది సర్టిఫికెట్లు పరిశీలించారు. నున్న గ్రామం నుంచి 164 మంది, అంబాపురం నుంచి 62 మంది, పాతపాడు నుంచి 66 మంది, పి.నైనవరం నుంచి 39 మంది హాజరయినట్టు ఎంఈఓ ఎ. వెంకటరత్నం తెలిపారు.

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరులోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రాయితీపై వివిధ కార్పొరేషన్ల రుణాలకోసం ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ, ఓబీసీ, కమ్మ, కాపు, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ, ఆర్య వైశ్య కార్పొరేషన్ల రుణాలు కోసం ధరఖాస్తు చేసుకున్న 15 గ్రామాలకు చెందిన 290 మందికిగాను 241 మంది హాజరయ్యారు. బ్యాంకర్లు, అధికారులు అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించడంతో పాటు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఎంపీడీఓ జోగేశ్వరరావు, ఎస్‌బీఐ, కెనరా బ్యాంక్ మేనేజర్లు, పలువురు గ్రామపంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అకాల వర్షం.. అన్నదాతకు అపార నష్టం


నున్న గ్రామంలో ఈదురుగాలులకు పడిపోయిన అరటిచెట్లు


రాలిపోయిన మామిడి కాయలను ఏరుతున్న రైతులు

విజయవాడరూరల్: అకాల వర్షాలు, ఈదురుగాలులు బలంగా వీచడంతో అన్నదాతలు నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు తడిసిపోయాయి. మామిడితోటల్లో కాయలు రాలిపోవడం, అరటి తోటలు పడిపోవడం, సపోట చెట్లు విరిగిపడిపోవడం జరిగింది. నున్న, పాతపాడు, కొత్తూరు తాడేపల్లి, పి.నైనవరం గ్రామాల్లో మామిడి చెట్లు పడిపోవడంతో అపారనష్టం ఏర్పడింది. మండలంలో మామిడితోటలు 4,500 ఎకరాలు, అరటి తోటలు 30 ఎకరాలు, సపోట తోటలు 30 ఎకరాలు, బొప్పాయి తోటలు ఉన్నాయని ఉద్యానశాఖ అధికారి తెలిపారు. ఒక వైపు తడిసిన వరి ధాన్యం ఆరబెట్టుకోవడం, కొనుగోలు విషయంలో జీపీఎస్ సదుపాయం లేక రైతులు నానాఅవస్థలు పడుతున్నారు. అకాల వర్షాలు, ఈదురుగాలులతో నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గ్యాస్ సిలిండర్ ధర పెంపుపై నిరసన


ఉయ్యూరులో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ఉయ్యూరు: గ్యాస్ భారాన్ని ప్రజలపై మోపడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి వై నరసింహారావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ ఉయ్యూరు ప్రధాన సెంటరులో మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు తగ్గుతుంటే మన దేశంలో ధరలు పెంచడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ పేదల వెన్ను విరుస్తోందని ధ్వజమెత్తారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించే వరకూ నిరసన కొనసాగుతుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పంచకర్ల రంగారావు, ఆర్‌సీపీ రెడ్డి, బీ రాజేష్, రామచంద్రరరావు, సుబ్రహ్మణ్యం, కీర్తి, కొండ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవిష్యత్‌లో మూల్యం చెల్లించక తప్పదని సీపీఎం నాయకుడు బర్రె లెనిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాపులపాడు మండలం బండారుగూడెంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ సిలిండర్ల ధరల పెంపుపై సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. తక్షణమే ధరలను తగ్గించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు ఏర్పాటు చేయాలి


డైనింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న బత్తుల పద్మావతి

రామవరప్పాడు: ప్రతి తరగతి గదిలో చైల్డ్ హెల్ప్ లైన్ నంబరు (1098) కనిపించేలా ఏర్పాటు చేయాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. విజయవాడరూరల్ మండలం గూడవల్లిలోని కేకేఆర్ గౌతమ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, శ్రీ చైతన్య కళాశాల, పలు హాస్టల్స్‌లో మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి పాఠశాలలోని విద్యార్థులతో ముచ్చటించారు. హాస్టల్స్‌లో భోజనశాల, మరుగుదొడ్లు, వసతుల కల్పనను పరిశీలించారు. పద్మావతి మాట్లాడుతూ మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, సురక్షిత తాగునీరు అందించాలని సూచించారు. భోజనశాల శుభ్రంగా ఉంచాలని, నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలు తయారీ చేయాలన్నారు. డైనింగ్ హాల్ క్లీనింగ్ రిజిస్టర్ ఉంచాలని, కంప్లైంట్ బాక్స్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పనిసరిగా ఉంచాలన్నారు. పేరెంట్స్ కమిటీ సమావేశాలు ప్రతి నెలా నిర్వహించాలని సూచించారు. అనంతరం శ్రీ చైతన్య కళాశాల సందర్శించి వసతులపై సమగ్ర పరిశీలన చేశారు. విద్యార్థుల శారీరక, మానసిక భద్రత పట్ల మరింత శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు రవి భార్గవ, సీడీపీవో మంగమ్మ, ఎన్టీఆర్ జిల్లా డీసీపీవో ఎం రాజేశ్వరరావు, ఎల్‌సీపీవో కిరణ్‌కుమార్, ఆర్ఐ రాజేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం సబ్‌రిజిస్ట్రార్ డీ జయరాజు ప్రారంభించారు. ఏటా వేసవిలో చలివేంద్రం నిర్వహిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులను సబ్ రిజిస్ట్రార్ అభినందించారు. జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బెక్కం వెంకటేశ్వరరావు, సభ్యులు సుకుమార్, కృష్ణ, భార్గవ్, భవాని, మాధవి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

## పేరంటాలమ్మ తిరునాళ్ల ప్రారంభం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ దేవత పేరంటాలమ్మ తిరునాళ్ల మంగళవారం ప్రారంభమయ్యాయి. గ్రామ దేవతా మూర్తులైన శ్రీగోపిరెడ్డి పార్వతమ్మ, శ్రీ చింతయ్య వీరమ్మ, శ్రీ రామిరెడ్డి నాగమ్మలను మానుపూజ అనంతరం గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. బుధవారం శాంతికల్యాణం, గురువారం శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, సాయంత్రం పంబళ్ల వారిచే అంకమ్మతల్లి పురముల ఏర్పాటు, శుక్రవారం పంబళ్ల వారిచే పోటు గొర్రె కార్యక్రమం నిర్వహించనున్నారు. శనివారం పసుపు బండి, బోనాలు సమర్పించడం, సాయంత్రం సిడిబండి ఊరేగింపు, అమ్మవారి ఊయల కార్యక్రమం జరుగుతుందని తిరునాళ్ల నిర్వాహకులు తెలిపారు. భక్తులు తిరునాళ్లలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

## పొలాల్లో చెత్త డంపింగ్


పొలాల్లో చెత్త వేసి నిప్పు పెట్టిన దృశ్యం

పెనమలూరు: కానూరు శివారు విజయ ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో పలు వాహనాల నుంచి పెద్ద ఎత్తున చెత్త తీసుకువచ్చి పంట పొలాల్లో వేస్తున్నారు. పైగా చెత్తకు నిప్పు పెట్టడంతో దట్టమైన పొగతో పరిసరాలు కాలుష్యం అవుతున్నాయి. విజయవాడ నగరం, ఆటోనగర్ ప్రాంతం నుంచి ఈ చెత్త తీసుకువస్తున్నారని భూ యజమానులు ఆరోపిస్తున్నారు. చెత్త లోడ్‌తో వచ్చిన లారీలను భూయజమానులు అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### క్లుప్తంగా

#### నీటి సమస్యపై ఫిర్యాదు



పెనమలూరు: పోరంకి రామాపురం కాలనీలో పైపులైన్ నుంచి నీరు సక్రమంగా రావడం లేదని కాలనీవాసులు మంగళవారం తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ పీ భవానిప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు వివరాలు తెలుపుతూ కాలనీలో 127 గృహాలు ఉన్నాయని పైపులైన్ ద్వారా నీరు సక్రమంగా సరఫరా జరగడం లేదన్నారు. దీనిపై మున్సిపాలిటీ అధికారులు తనిఖీ చేసి పైపులైన్‌లు సక్రమంగా లేవని తెలిపారన్నారు. తాము మున్సిపాలిటీకి సకాలంలో ఆస్తి పన్ను, నీటి పన్నులు చెల్లిస్తున్నామని చెప్పారు. నీటి సమస్య మరింత తీవ్రం కాకముందే పైపులైన్ నిర్మాణం చేయాలని కోరారు. కాలనీ అధ్యక్షుడు పొలడుగు సాయిబాబు, కార్యదర్శి సీహెచ్ రాజేంద్రప్రసాద్, ట్రెజరర్ విజయరాఘవన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

#### ముగిసిన వసంత నవరాత్రులు



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న చైత్రమాస వసంత నవరాత్రులు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక వస్త్రాలంకరణ, వివిధ రకాల పుష్పాలతో అర్చనలు చేశారు. అనంతరం శ్రీలలిత సహస్రనామ పారాయణం, హనుమాన చాలీసా పారాయణం నిర్వహించారు. వసంత నవరాత్రులు భక్తులందరి సహకారంతో విజయవంతంగా ముగిసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. పలువురు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

#### మట్టి నమూనాల సేకరణ




పెనమలూరు: మండలంలో మట్టి నమూనాలు సేకరించడం ప్రారంభించామని మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ తెలిపారు. పోరంకి రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఆమె రైతులతో మాట్లాడారు. మట్టి నమూనాల సేకరణను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మట్టి నమూనాల వల్ల భూమిలో ఉన్న పోషక శాతం తెలుస్తుందన్నారు. పోషక స్థాయిని బట్టి సాయిల్ హెల్త్ కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. దీని ప్రకారం ఆయా పోషకాలను భూమికి ఇవ్వడం వల్ల పంటల దిగుబడి సాధించగలుగుతామని పేర్కొన్నారు. మండలంలో మొత్తం 338 శాంపిల్స్ టార్గెట్‌గా పెట్టామని తెలిపారు.

#### మజ్జిగ పంపిణీ



కంకిపాడు: కంకిపాడు రైతుబజారు సెంటర్‌లో సమితి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంటూరి ఏలియా ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఏలియా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఉయ్యాల ఏడుకొండలు, నాయకులు చోరగుడి రాజేంద్ర, టెక్కెం శేషు, కుంబా రవి, షేక్ మున్ని, షేక్ నాగూర్, పైడి అచ్చిమ్మ తదితరులు పాల్గొన్నారు.

#### గణితంలో విద్యార్థుల ప్రతిభ



ఉయ్యూరు: గణితం ప్రతిభా పోటీల్లో ఉయ్యూరు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటారు. గత నెల 25వ తేదీన వేదిక్ మ్యాథ్స్ రాష్ట్రస్థాయి పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ఎంకే ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఆరుగురు ప్రథమ, మరో ఆరుగురు ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు వేదిక్ సంస్థ ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను మంగళవారం పాఠశాల డైరెక్టర్ ఎంకే బాబు అందించి అభినందించారు.

#### సకాలంలో పన్నులు చెల్లిస్తే 5 శాతం రాయితీ

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో సకాలంలో పన్నులు చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ఉంటుందని మున్సిపాలిటీ కమిషనర్ పీ భవానిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జీవో–267 ప్రకారం 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు ఈ నెల 30వ తేదీలోపు చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఉన్న యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

#### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: తాడిగడప సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లో బుధవారం ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఆపరేషన్స్ పీ హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా తాడిగడపలోని జెడ్పీ హైస్కూల్ ప్రాంతం, ఎస్టీబీఎల్‌కాలనీ, ఊరచెరువు, పెదపులిపాక గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

#### బాలిక అదృశ్యం

పెనమలూరు: గంగూరులో బాలిక అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. గంగూరు గ్రామానికి చెందిన ఎండీ రహిమా, ఆసీఫ్ భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు. రెండవ కుమార్తె ఇంటర్ చదువుతుంది. ఆ బాలిక ఇంటి పనులు చేయడం లేదని తల్లి మందలించింది. దీంతో ఈ నెల ఏడవ తేదీన బాలిక ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు బాలిక కోసం వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

#### 13న గురుకుల ప్రవేశ పరీక్ష

గన్నవరం రూరల్: ఏపీ సాంఘిక సంక్షేమ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ఐదవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కొరకు ఈ నెల 13వ తేదీ ఆదివారం ప్రవేశ పరీక్ష జరుగుతుందని వీరపనేనిగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై యశోదలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఐదవ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం రెండు నుంచి 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్‌లను వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని వివరించారు. ఏదైనా గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

#### శ్రీకోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు



కంకిపాడు: పట్టణంలోని లాకురోడ్డులో వేంచేసి ఉన్న శ్రీకోదండ రామాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి పురస్కరించుకుని నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రెండు వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాన్ని దస్తావేజు లేఖరుల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి హరికృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు వణుకూరు విక్రమ్, పులి శ్రీనివాసరావు, ఆకునూరు సుబ్బారావు, శివపార్వతి, షేక్ సలీం, గాజులపల్లి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

#### వైభవంగా శ్రీరంగమ్మ పేరంటాలు అమ్మవారి ఉత్సవాలు



తేలప్రోలు(గన్నవరం): ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామంలో కొలువైన శ్రీరంగమ్మ పేరంటాలు మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న గ్రామోత్సవం మంగళవారం కూడా కొనసాగింది. ఊరేగింపుగా తరలి వచ్చిన శ్రీరంగమ్మ పేరంటాలు అమ్మవారికి గ్రామస్తులు హారతులు పట్టారు. ఈ నెల 16వ తేది వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. ఈ నెల 11న అంకగుడారి వేయడం, 12 నుంచి 14వ తేది వరకు అమ్మవారికి ఉయ్యాల సేవ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 15న అమ్మవారికి నైవేద్యాలు(బోనాలు) సమర్పించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలను భక్తులు జయప్రదం చేయాలని కోరారు.